కథ

# శతాబ్ది ఎక్స్‌ప్రెస్

పాలంకి సత్య

ఇరవైయవ శతాబ్ది ఆరంభం. 1900వ సంవత్సరం.

అచ్చమ్మ ఉదయమే నిద్రలేచి, వీధిలో కళ్ళాపి చల్లింది. వీధి చివరన ఉన్న నూతి దగ్గరకు వెళ్ళి, నూతి దగ్గరే చేదతోనే స్నానం చేసి, ఇంటిల్లిపాది వంటకీ సరిపోయే నీళ్ళు మోసుకొచ్చింది. పొయ్యి అంటించి ఎసరు పడేసి, బియ్యం ఏరింది. అత్తా, ఆడపడుచుల సూటిపోటి మాటల మధ్య వంట పూర్తి చేసింది. అందరి భోజనాలూ పూర్తయి అచ్చమ్మ అన్నం తినేసరికి మూడయింది. వంటిల్లు శుభ్రం చేసేసరికి, సందెకసవు ఊడ్చే సమయమయింది.

పాతికేళ్ళు గడిచాయి. 1925 సంవత్సరం.

అచ్చమ్మ కొడుకు టీచరుద్యోగంలో చేరాడు. అచ్చమ్మ కోడలు శాంతమ్మ ఉదయమే నిద్రలేచి కుంపట్లు రాజేసి, వంట మొదలెట్టింది. అచ్చమ్మ సణుగుడు మొదలెట్టింది.

''వెధవ పట్నంలో కాపురం, బోడి కుంపట్ల మీద వంట, మరీ సుకుమారాలు మీరిపోయారు. చక్కగా పొయ్యి మీద బియ్యం పడేసి, అన్నం పొంగుకు వచ్చాక, గంజివారిస్తే ఎంత రుచిగా ఉంటుంది. అంత ఓపిక లేవీ? ఏదో ఇంత బియ్యం ఎత్తిసరుపడెయ్యడం, సాయంత్రమయ్యేసరికి నాటకాలకో సినిమాలకో బయల్దేరడం. ఇంట్లో మొగుడికి రుచిగా, శుచిగా వండి పెట్టాలనైనా లేదు. నా కొడుకు మరీ మెత్తవాడైపోయాడు. కోడలికి ఏం చేసినా సాగుతోంది...''

అత్తగారి సణుగుడికి శాంతమ్మ మనస్సులోనే సమాధానం చెప్పుకుంది. ''అత్తగారికి తన చిన్నతనంలో కష్టాలు గుర్తుండవా లేక కోడలూ తనలాగే చావాలనుకుంటుందా? పొయ్యి అంటించి, పొగతో కళ్ళు మండుతూ వండితేనే వంటకు రుచి వస్తుందా? అయినా పట్నవాసంలో చిన్న ఇళ్ళల్లో పొయ్యి ఎక్కడ పెట్టాలి, ఎలా అంటించాలి? ఈవిడకి ఆమాత్రం తెలియదా? పొయ్యి మీద వంట మొదలెడితే ఆయనని టైంకి స్కూలికి పంపగలనా? సుఖంగా తిని కూర్చోకుండా గోలపెట్టడమెందుకు..''

అచ్చమ్మ సణుగుతూనే ఉంది. శాంతమ్మ మనస్సులో విసుక్కుంటూనే ఉంది.


మరో పాతికేళ్ళు గడిచాయి. 1950వ సంవత్సరం..

శాంతమ్మ కొడుకు ఎమ్.ఎ.పాసయి మద్రాసులో కాలేజీలో లెక్చరరుగా చేరాడు. శాంతమ్మ కోడలు సావిత్రి కాపురానికి వచ్చింది. ఆమె కాపురానికి రాగానే ముందుగా రెండు కిరసనాయిల్ స్టవ్వులు కొనుక్కుంది.

సావిత్రి వంట మొదలెట్టగానే శాంతమ్మ దండకం మొదలెట్టింది.

''వంటింట్లో అడుగు పెట్టకపోతున్నాను బాబూ కిర్సనాయిలు వాసన. వంట కూడా కిర్సనాయిలు వాసనే. ఏం కుంపట్ల మీద వండకూడదా నేను కుంపట్ల మీద వండలేదా, మా ఆయనని టైంకి స్కూలికి పంపలేదా? రెండు కుంపట్లూ రాజేసి, ఒకదాని మీద బియ్యం, ఒకదాని మీద పప్పూ పడేసేదాన్ని. బియ్యం ఉడికేసరికి కూర తరిగేసేదాన్ని. కుంపటి సన్నటి సెగమీద నెమ్మదిగా ఉడికిన పప్పు కమ్మతనం ఈ స్టవ్వుల మీద హడావుడిగా ఉడకబెడితే వస్తుందా...''

సావిత్రి తనలో తాను అనుకుంది ''ఇంటి దగ్గర స్కూల్లో టీచరుద్యోగానికి వెళ్ళడమూ, పెద్ద సిటీలో దూరంగా ఉన్న కాలేజీకి వెళ్ళడమూ ఒక్కటేనా? బస్సులు పట్టుకుపోవాలంటే ఆయనకి గంట పడుతుంది. అలాంటప్పుడు పొద్దున్నే కుంపట్లు రాజేస్తూ కూచుంటే వంట



పూర్తి చేసేదెప్పుడు? ఉద్యోగం ఊడితే పప్పు కాదు కదా, పప్పులోకి ఉప్పుకొనుక్కుందుకు కూడా డబ్బులుండవు..''

శాంతమ్మ, సావిత్రిల మనోభావాలతో సంబంధం లేకుండా వంట పూర్తయింది.

మరో పాతికేళ్ళు గడిచాయి. 1975వ సంవత్సరం.

సావిత్రి కొడుకు బాంక్ ఆఫీసరయ్యాడు. కాలేజి లెక్చరరు విమలను పెళ్ళి చేసుకున్నాడు. విమల ఉదయమే లేచి రాత్రి పూటే తరిగి ఫ్రిజ్‌లో ఉంచుకున్న కూరగాయలు, పప్పూ, బియ్యం కలిసి ప్రెషర్ కుక్కర్‌లో పెట్టి గాస్ స్టౌ అంటించింది. గాస్ స్టౌతోపాటు సావిత్రి మనస్సు కూడా అంటుకుంది.

''చూడు విమలా, వంట అంటే ఏమిటో సిటీలైఫ్ అంటే ఏమిటో తెలియని దాన్ని కాదు. కానీ వండాల్సినవన్నీ కలిపి ఒకేసారి కుక్కర్‌లో పడేస్తున్నావు. అన్నం ఉడికేసరికి పప్పుడకడం లేదు. పప్పు ఉడికేసరికి అన్నం ముద్దయిపోతోంది. అయినా గుత్తివంకాయ కూర కూడా నిన్న కుక్కర్‌లో పెట్టేశావేమిటి? అలాంటి కూర దళసరి గిన్నెలో వండుకోవాలి. నువ్వు ఉద్యోగం చేస్తున్నావు కదాని, వాడు తింటున్నాడు కదాని ఎలా పెడితే అలా పడెయ్యడమే...''

విమల చెప్పదల్చుకున్నది పైకే చెప్పింది ''ఇంట్లో, బయటా పని చేస్తున్నానన్న సానుభూతి లేదు. హాయిగా తిని కూచోక ఎందుకీ గొడవ? పనంతా పూర్తి చేసుకుని వెళ్ళాలంటే, వంటింట్లో స్టౌదగ్గరే నిల్చుంటే సాగుతుందా? కుక్కర్ పెట్టి విజిల్ వచ్చేలోగా మిగతా పని చేసుకుంటాను''

మరో పాతికేళ్ళు గడిచాయి. ఇరవైయవ శతాబ్ది అంతం. 2000వ సంవత్సరం...

విమల కోడలు ఆర్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఉదయమే ఫ్రీజర్‌లో నుంచి నాలుగు అయిటమ్స్ తీసి మైక్రోవేవ్ ఓవెన్‌లో ఒకదాని తర్వాత ఒకటి వేడి చేసింది. ఆమె పదార్థాలని డైనింగ్ టేబిల్ మీద పెడుతుండగా విమల డైనింగ్ రూంలోకి వచ్చింది.

''చూడు ఆర్తీ, నేనూ ఉద్యోగం చేశాను కానీ నీలా ఏ రోజు వంట ఆ రోజు చెయ్యకుండా మాత్రం లేను. నీకు మూడ్ వచ్చినప్పుడో, తీరిక ఉన్నప్పుడో అన్నీ వండేసి ఫ్రిజ్ నిండా కుక్కెయ్యడం, ప్రతిరోజూ మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చెయ్యడం ఎందుకు? ఏ పూటకి ఆపూట ఫ్రెష్‌గా వండుకున్న రుచి ఇలా ఫ్రిజ్‌లో పెట్టినవాటికి వస్తుందా?...''

విమల మాటలకి జవాబు చెప్పలేదు ఆర్తి, డ్రాయింగ్ రూంలోని కంప్యూటర్ ముందు కూచుని కీబోర్డుమీద టైపు మొదలెట్టింది.

''నేను చాలా పాతకాలం దాన్ని కాబట్టే వంట చేస్తున్నాను. డయల్ ఏ-పిజ్జాలాంటి షాపులకి ఫోను చేసి పిజ్జాలో, బర్గర్లో తెప్పించకుండా, రోజూ హోటళ్ళకి తిరగకుండా ఇంట్లో అందరి ఆరోగ్యమూ బాగుండాలని వంట చేస్తున్నాను. మైక్రోవేవ్ కుకింగ్ అన్నిటికన్నా మంచి మార్గం. మీరూ చదువుకున్నారు. ఆ మాత్రం తెలియదా? ఎంత బిజీ షెడ్యూలున్నా, ఎంత శ్రమపడి ఇంటికి వచ్చినా కూడా నేను హోటల్లో తిందాం అనడం లేదే. నా కష్టానికి గుర్తింపు లేకపోతే ఇక కష్టపడడం అనవసరమనిపిస్తోంది...''

ఇంట్లోనే ఉన్నప్పటికీ అత్తగారికి ఇ-మెయిలు పంపింది ఆర్తి.

★★★

ఒక్క శతాబ్దంలో టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందింది కానీ అత్తాకోడళ్ళ వంటింటి సంభాషణా ధోరణిలో మార్పులేదేమి? అభివృద్ధి అత్తాకోడళ్ళ సంబంధానికి అడ్డుగోడా లేక అత్తా కోడళ్ళ సంబంధమే అభివృద్ధి నిరోధకమా? వంట చేసే సాధనం పొయ్యి దగ్గరే మిగిలిపోతే...ఈ కథ ఉండేది కాదా?

★